
సాక్షి ఒడిశా

గురువారం । 23 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,53,403లు, బంగారం 2 గ్రాములు, వెండి 4 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

ఈ నెల 19న గురండి పోలీసు ఠాణా పరిధిలో సర్దాపురం వంతెన వద్ద జరిగిన ప్రశాంత్ జెన్నా హత్య కేసును ఛేదించారు

- 8లో



వృద్ధులకు చీరలు పంపిణీ

రాయగడ పట్టణంలోని శక్తి సీనియర్ సిటిజన్ వృద్ధాశ్రమంలో ఉన్న మహిళలకు స్థానిక ఉత్కళ మీడియా ప్రతినిధులు బుధవారం చీరలు పంపిణీ చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

అసిస్టెంట్ ఇంజినీర్‌కు మూడేళ్ల జైలుశిక్ష

పర్లాకిమిడి: గ్రామీణ తాగునీరు, శానిటేషన్ డివిజన్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్, అదనపు ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన నారాయణ పండా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసులో మూడేళ్ల జైలు శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ బరంపురం విజిలెన్సు కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు. గడువులోగా జరిమానా కట్టకపోతే మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రిటైర్‌మెంట్ పెన్షన్ కూడా నిలుపుదల చేయాలని సంబంధిత ఈఈకి ఆదేశాలు జారీ చేశారు.

కేంద్ర ఆస్పత్రిని సందర్శించిన ముస్కాన్ బృందం



ఆస్పత్రి సిబ్బందితో చర్చిస్తున్న ముస్కాన్ బృందం సభ్యులు

జయపురం: స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిని ముస్కాన్ రాష్ట్ర బృందం బుధవారం సందర్శించింది. ఎంసీహెచ్ భవనంలో ఉన్న శిశు ఇండోర్, ఔట్ డోర్, ఎస్ఎన్‌సీయూ డీఈఐసీ (డిస్ట్రిక్ట్ అర్లీ ఇంటరవెన్షన్ సెంటర్), ఎన్ఆర్‌సీలను పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు బృంద సభ్యులు సూచించారు. కొద్దిరోజుల్లో కేంద్ర ముస్కాన్ బృందం కూడా ఆస్పత్రిని సందర్శిస్తోందని వైద్య వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు బృందాలు అసెస్‌మెంట్లలో జిల్లా కేంద్ర ఆస్పత్రి సేవలు బాగున్నట్టు గుర్తిస్తే సర్టిఫికెట్‌ను అందిస్తారు. ఆస్పత్రిని సందర్శించిన ముస్కాన్ బృందంలో భువనేశ్వర్‌లోని కేపిటల్ ఆస్పహాత్రి శిశు రోగ విభాగ ప్రభుత్వ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పరాజ్ ప్రధాన్ నేతృత్వం వహించారు. ఈ బృందం తొలుత జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్ మిశ్రతో చర్చించారు. డాక్టర్లు, స్టాఫ్ నర్స్‌లు, అటెండెర్ల పనితీరు, వారిసేవలపై చర్చించింది. కార్యక్రమంలో ఆస్పత్రి శిశు వైద్య నిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్ పాత్రో, డాక్టర్ గౌతమ త్రిపాఠీ, ఆస్పత్రి మేనేజర్ తథాగత దాస్, మ్యాట్రిన్ జ్యోత్స్నరాణి బెహర, జ్యోతిప్రభ సాహు, స్టాఫ్ నర్స్ గీతాంజలీబెహర ఉన్నారు.

36 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గంజాయి రవాణా గుట్టు రట్టయింది. రాయగడ రైల్వేస్టేషన్ కూడలిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు తనిఖీ చేయగా వారి బ్యాగుల్లో 36 కిలోల గంజాయి బయటపడింది. దీంతో వారిని మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టయిన వారిలో శిబాన్ సాబొరొ, నవఘన సరక, మనొజ్ మాఝి, సుమంత్ మాఝిలు ఉన్నట్లు స్థానిక పోలీస్ స్టేషన్ ఐఐసీ కేకేబీకే కుహూరో తెలిపారు. అరెస్టయి వారిలో నవఘన సరక అనే యువకుడు కటక్ పోలీస్ విభాగంలో వోఎస్ఏపీ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు విచారణలో తెలిసింది. ఎప్పటిలాగే పోలీసులు రైల్వే స్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో నిందితులు పట్టుబడ్డారు. జిల్లాలోని కెందుగుడ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి రైలులో రాయిపూర్‌కు రవాణా చేసేందుకు నిందితులు సన్నహాలు చేసినట్టు తమ దర్యాప్తులో తెలిసిందని కుహూరా తెలిపారు.

26న ప్లస్ టూ పరీక్ష ఫలితాలు వెల్లడి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్ఎస్ఈ) నిర్వహించిన 12వ తరగతి బోర్డు పరీక్ష (+2) ఫలితాలు ఈ నెల 26న విడుదల కానున్నాయి. ఈ సంవత్సరం ఆర్ట్సు, సైన్స్, కామర్స్, వృత్తి విద్యా కోర్సు పరీక్ష ఫలితాల స్థానిక సీహెచ్ఎస్ఈ ప్రధాన కార్యాలయంలో ఒకేసారి ప్రకటించనున్నారు. ఫలితాలు www.orissaresults.nic.inలో అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులు తమ ఫలితాలను తమ హెచ్ఎస్ స్కూల్ ఈ-స్పేస్, డిజీ లాకర్‌లో కూడా పొందవచ్చని సీహెచ్ఎస్ఈ తెలియజేసింది. సీహెచ్ఎస్ఈ నిర్వహించిన 12వ తరగతి బోర్డు పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరి 16 నుంచి మార్చి 20 వరకు జరిగాయి. 3,86,250 మంది విద్యార్థులు హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం మార్చి 22 నుంచి ప్రారంభమైంది.

ఈవీఎంల మొరాయింపు.. నివారణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ చంచల్ రాణా

- ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు
- ఖుర్ధా జిల్లా కలెక్టర్ చంచల్ రాణా

భువనేశ్వర్:

ఖుర్ధా జిల్లావ్యాప్తంగా వివిధ శాసనసభ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలలో ఏర్పడే సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు 24 మంది ఈసీఐఎల్ ఇంజినీర్లను నియమించనున్నట్లు కలెక్టర్ చంచల్ రాణా తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగిన మొదటి, రెండో దశ ఎన్నికలు పురస్కరించుకుని తలెత్తిన ఈవీఎం మొరాయింపు సంఘటనల దృష్ట్యా, ఈనెల 25వ తేదీన జరగనున్న మూడో దశ ఎన్నికలకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉందన్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన రోజు నుంచి జిల్లాస్థాయి కంట్రోల్ యూనిట్‌ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంబంధిత సమస్యలు, ఫిర్యాదులను దాఖలు చేసేందుకు ప్రజలకు టోల్ ఫ్రీ నంబర్ 1950ను అందుబాటులో ఉంచినట్లు గుర్తుచేశారు. ముద్రణ, ఎలక్ట్రానిక్, సాంఘిక ప్రసార మాధ్యమాలపై పటిష్టమైన పర్యవేక్షణ ఉంటుందన్నారు.

నకిలీ సమాచారంపై నిఘా

నకిలీ సమాచారం ప్రసారం నిరోధించడానికి పోలింగ్‌కు 72 గంటల ముందు నుంచే గట్టి నిఘా ఉంటుందని హెచ్చరించారు. ప్రతీ రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో), జిల్లా ఎన్నికల కార్యాలయంలో కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఈవీఎంలు పని చేయకపోవడం, ఎన్నికల్లో హింస, ఓటరు పోలింగ్ శాతాలు సకాలంలో నవీకరణలకు సంబంధించిన వ్యవహారాలను ఈ కేంద్రాలు పర్యవేక్షిస్తాయి. అలాగే పరిశీలకులు, రాజకీయ పార్టీల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద 55 మంది మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నామని తెలిపారు. మొత్తం 1,923 పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగుల ఓటర్లకు చేయూతగా నిలిచేందుకు ప్రతీ కేంద్రానికి ఒక్కొక్కరు చొప్పున వాలంటీర్‌ని నియమించారు. వీరందరికీ రెండు విడతల్లో శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. వివిధ పోలింగ్‌స్టేషన్లలో ర్యాంప్, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యామ్నాయ హామీ పూర్వక వ్యవస్థతో సోలార్, డిజి బ్యాకప్ వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

వడదెబ్బ నివారణకు చర్యలు

వడదెబ్బ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఓటు వేసేందుకు బారులుతీరిన వృద్ధులకు కుర్చీలతో పాటు ఆకస్మిక వడదెబ్బ సత్వర చికిత్స సదుపాయాలు, సౌకర్యాలను అందుబాటులో ఉంచుతారు. ఓటు వేసేందుకు వచ్చే ఉద్యోగినులైన తల్లుల బిడ్డలను సురక్షితంగా ఉంచేందుకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో క్రెచ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ చికిత్సపై ప్రాథమిక అవగాహన ఉన్న ఆరోగ్య కార్యకర్తలను ప్రతీ పోలింగ్ బూత్ వద్ద ఉంచుతారు. పోలీసు బృందం సహాయంతో సంచాలక ఆరోగ్య యూనిట్‌ను కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ సౌకర్య (ఫెసిలిటేషన్) సెంటర్‌ను ఏర్పాటు చేశామని, అన్ని సఖి బూత్‌లకు అదనపు బాల్టీలు, మగ్‌లను అందజేస్తామన్నారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో మూడు చొప్పున చెత్త సేకరణ బుట్టలు ఏర్పాటు చేసి, పోలింగ్ బూత్‌ల పరిసరాల్లో వ్యర్థాలను తొలగించి చక్కటి పర్యావరణం కల్పించేందుకు సన్నాహాలు పూర్తైనట్లు పేర్కొన్నారు. మండల అభివృద్ధి అధికారులు (బీడీవో), కార్యనిర్వహణ అధికారులు (ఈవో), ముఖ్యంగా భువనేశ్వర్ నగర పాలక సంస్థ బీఎంసీ కమిషనర్ పర్యవేక్షణలో సకాలంలో శుభ్రపరచడం మరియు తొలగించడం వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. ఓటింగ్ సౌలభ్యం కోసం వికలాంగులకు రవాణా సౌకర్యం కూడా కల్పించబడిందని వివరించారు.

దొంగల ముఠా అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన దొంగలు

- ముగ్గురు అరెస్టు

జయపురం: మల్కన్‌గిరి నుంచి వ్యాన్‌లో జయపురం వస్తున్న బట్టల వ్యాపారిని అడ్డగించి అతని నుంచి రూ.1.80 లక్షలు దోచుకు పోయిన ముగ్గురు దుండగులను అరెస్టు చేశామని బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళి ప్రధాన్ బుధవారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.22,800 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక బైక్, మాస్కులు, టీచొక్కాలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ నెల 18వ తేదీన జయపురం పట్టణానికి చెందిన బట్టల వ్యాపారి ఎ.సత్యనారాయణ గుప్త సంతలకు వెళ్లి వ్యాన్‌లో విజయవాడ- రాంచీ జాతీయ కారిడార్‌లో మల్కనగిరి నుంచి బొయిపరిగుడ మీదుగా జయపురం వస్తున్నారు. బొయిపరిగుడ-జయపురం మధ్య మహులి ఘాట్ రోడ్డులో మోటారుబైక్‌లపై ఇద్దరు వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి వ్యాన్‌ను అడ్డుకున్నారు. తాము ఫైనాన్స్ కంపెనీ నుంచి వచ్చామని చెప్పి వ్యాన్ తాళాలు తీసుకున్నారని పోలీసు అధికారి దీపాంజళీ ప్రధాన్ వివరించారు. కొంత సమయం తరువాత మరో ముగ్గురు ముఖానికి మాస్కులు వేసుకొని వ్యాన్ వద్దకు వచ్చి మారణాయుధాలను బట్టల వ్యాపారి సత్యనారాయణగుప్తకు చూపించి డబ్బు ఇమ్మని డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే చంపుతామని హెచ్చరించారు. వ్యాపారి నిరాకరించటంతో అతడిని దుండగులు కొట్టి బయటకు నెట్టి వ్యాన్‌లో ఉన్న డబ్బుతో పాటు రెండు మొబైల్ ఫోన్లను తీసుకొని దుండగులు పరారయ్యారు. దీంతో బాధిత వ్యాపారి బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దుండగులు జయపురం వాసులని వెల్లడైందని పోలీసు అధికారి పేర్కొన్నారు. జయనగర్ బబులా బాగ్ హరిజన్, సురేష్ హరిజన్, అలోక్ కుమార్ పంగిలను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి చెప్పారు. పట్టుబడిన దొంగలను గతంలో వివిధ కేసుల్లో జయపురం, నందపూర్ పోలీసులు అరెస్టు చేసి ఉన్నారన్నారు. ఈ కేసులో మిగతా వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు.

సైకిల్ దొంగ అరెస్టు



సైకిల్‌తో పట్టుబడిన నిందితుడు ఆనంద

జయపురం: సైకిళ్లను దొంగిలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ పోలీసులు మంగళవా రం తెలిపారు. అతని నుంచి స్థానిక సునారీ వీధి బక్షి అపార్ట్‌మెంట్‌లో దొంగిలించిన సైకిల్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18వ తేదీన స్థానిక సునారివీధి బక్షి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న కె.ఎం.అనిష్ కుమారుడు తన సైకిల్ ను ఇంటి ముందు పార్క్ చేసి లోనికి వెళ్లాడు. కొంచెం సమయం తరువాత ఇంటిలో నుంచి బయటకు వచ్చి చూడగా సైకిల్ కనిపించలేదు. దీంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన ఏఎస్సై విష్ణు మడకామి.. చోరీకి పాల్పడిన ఎస్.ఆనంద (అలియాస్ ఉరఫ్ పటలా కిశోర్‌కుమార్)ను అరెస్టు చేయడంతో పాటు దొంగిలించిన సైకిల్ ను అతని నుంచి స్వాధీనం చేసుకున్నారు. పదిరోజుల క్రితం ఆనంద ఒక సైకిల్‌ను దొంగిలించి పట్టుబడి జామీనుపై బయటకు వచ్చినట్టు వివరించారు. స్థానిక నొడియబెడ సాహిలో ఉంటున్న ఆనంద.. పట్టణంలో సైకిళ్లను దొంగి లి విక్రయించగా వచ్చే డబ్బులతో జల్సా చేస్తున్నట్టు పోలీసులు భావిస్తున్నారు.

• సందడిగా అమ్మవారి పండుగ



పర్లాకిమిడి పట్టణంలోని రైల్వేస్టేషన్ దారి సమ్ముటియా వీధిలో మా వుల్లో ఠాకురాణి అమ్మవారి పండుగలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా 15 వేల మంది భక్తులు అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్నారు. అయిదేళ్లకు ఒకసారి జరుపుకునే అమ్మవారి పండుగ సందర్భంగా సముటియా వీధిని విద్యుత్ దీపాలతో అలకరించారు. విచిత్ర వేషాధారణతో చిత్రకారవీధి, రాజగురు వీధిలో ఊరేగింపు జరిపారు. ఉత్సవాలు మంచివాతావరణంలో ముగిశాయని మాజీ కౌన్సిలరు జానకీ బెహేరా తెలిపారు.

–పర్లాకిమిడి

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు



నిందితుడు బుదురాం

జయపురం: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనలో భర్తను జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి బుధవారం తెలిపారు. బమొణిగాం సమీపంలోని సిరిగుడ గ్రామానికి చెందిన తులసికి బుదురాం అనే వ్యక్తితో గత ఏడాది వివాహం జరిగింది. బరిణిపుట్‌లో నివాసముంటున్న వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో గత 15న తులసి తన కన్నవారింటికి వచ్చేసింది. ఆ మరునాడు బుదురాం అత్తవారింటికి వెళ్లి భార్యను బుజ్జగించి తన ఇంటికి తీసువెళ్లాడు. ఈ నెల 17న తులసికి కడుపు నొప్పి వచ్చిందంటూ జయపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్చారు. తర్వాత ఇంటికి వచ్చి క్రిమి సంహారక మందు తాగేసింది. వెంటనే కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల మెడికల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. భర్త, అత్తమామలు వరకట్నం కోసం వేధించడం వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందంటూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై పోస్కోతో పాటు వివిధ సెక్షన్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

'నేను మావోయిస్టును కాను'



మింజిల శికక

రాయగడ: 'నేను మావొయిస్టును కాను. సాధారణ మనిషిని. తల్లిదండ్రులు, అక్కాచెల్లెలు ,అన్నదమ్ములతో కలిసి కొండపై వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాను. మావోయిస్టులు ఎలా ఉంటారో కూడా తెలియదు. వారు ఎటువంటి దుస్తులు వేసుకుంటారో కూడా తెలియదు. అటువంటి నాపై మావోయిస్టుగా పోలీసులు ముద్రవేయడం చాలా బాధాకరం' అంటూ నియమగిరి పర్వత ప్రాంతంలో నివసిస్తున్న డొంగిరియా తెగకు చెందిన మింజిలి శికక ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తాను మావొయిస్టు కాదంటే పోలీసులు లొంగిపోవాలని బెదిరించడం తగదని వాపోయారు. ఈ మేరకు ఓ ఒడియా న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తనను పట్టుకున్న వారికి రెండు లక్షల రుపాయల పారితోషికం ఇస్తామని పోలీసులు ప్రకటించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తన స్వగ్రామంలో సాధారణ జీవితం గడుపుతున్నానని, ఎటువంటి అసాంఘిక శక్తులతో కలిసి పనిచేయడం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తనపై మావోయిస్టు ముద్రను తొలగించాలని కోరారు.

భద్రత కట్టుదిట్టం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న పోలీసులు

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల మూడో దశ పోలింగ్ కోసం భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 25న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో స్థానిక కమిషనరేట్ పోలీసులు రాజధానిలో భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేశారు. పోలింగ్ సమయంలో హింసను నివారించడంలో భాగంగా పలు చర్యలు చేపడుతున్నట్లు పోలీసు కమిషనర్ సంజీవ్ పండా విలేకరులకు బుధవారం తెలిపారు. భువనేశ్వర్ కమిషనరేట్ పోలీస్ పరిధిలోని 1,132 పోలింగ్ కేంద్రాల్లో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు పోలీసులు భద్రతా చర్యలను పెంపొందించారు. వీటిలో 145 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 421 సఖి పోలింగ్ కేంద్రాల్లో సురక్షిత ఎన్నికల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. 525 పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నారు. ఘర్షణలు నివారించడానికి 15 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 15 వ్యూహాత్మక నిఘా బృందాల్ని రంగంలోకి దింపారు. అంతేకాకుండా, సమస్యాత్మక పోలింగు కేంద్రాల వద్ద కేంద్ర రిజర్వు పోలీసు దళం సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని మోహరిస్తారు.

నేటితో ప్రచారానికి తెర

రాష్ట్రంలో మూడో దశ పోలింగ్ పురస్కరించుకుని రాజకీయ పక్షాల ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగుస్తుంది. ఎన్నికల ప్రచారం ముగియడంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేయనున్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు పోలీసు కమిషనరు తెలిపారు. శాంతి, భద్రతల పరిరక్షణలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

పకడ్బందీగా రథయాత్ర నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న మిట్టు పాఢి



హాజరైన సభ్యులు

పర్లాకిమిడి: జూలై 7న జగన్నాథ గుండిచా రథయాత్ర అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిద్దామని కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అన్నారు. రథయాత్ర నిర్వహణపై కలెక్టరేట్ వద్ద గ్రామీణ స్వయం ఉపాధి కాన్ఫరెన్సు హాలులో బుధవారం కమిటీ చైర్మన్ సబ్ కలెక్టర్ అలోక్ పండా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు పూర్ణచంద్ర మహాపాత్రో, డీఎస్పీ చంద్రశేఖర్ హోత్తా, డి.ఆర్.డి.ఎ. కార్యనిర్వహణాధికారి గుణనిధినాయక్, తహశీల్దారు నారాయణ బెహరా తదితరులు హాజరయ్యారు. పారిశుద్ధ్యం, తాగునీరు, అంబులెన్సు, రోడ్డు మరమ్మతులు, మీనాబజార్‌కు వేలంపాట, రథ నిర్మాణానికి కొత్త కలప తదితర అంశాలపై చర్చించారు. గత ఏడాది జరిగిన రథయాత్ర జమాఖర్చులను సబ్ కలెక్టర్ అలోక్ పండా వివరించారు.

కొంటామల్‌లో రీపోలింగ్

భువనేశ్వర్: కంధమల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కొంటామల్ ప్రాంతంలో రీపోలింగ్ నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశించింది. ఈ నెల 23న కొంటామల్ బూత్ నంబర్ 26, 28లో రీపోలింగ్ నిర్వహించనున్నారు. ఓటింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని ప్రధాన ఎన్నికల అధికారి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లు, అభ్యర్థులకు దీనిపై అవగాహన కల్పించాలని బౌధ్, కంధమల్ జిల్లాల కలెక్టర్లను భారత ఎన్నికల సంఘం ఆదేశించింది. దిలీప్‌కుమార్ మహాపాత్రోను బౌధ్ అదనపు కలెక్టర్‌గా, కొంటామల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా కమిషన్ నియమించింది. కొంటామల్ నియోజకవర్గంలో బూత్ రిగ్గింగ్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో భారత ఎన్నికల సంఘం అనుమతితో బౌద్ జిల్లాలోని కొంటామల్ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని రెండు పోలింగ్ బూత్‌లు 26 – కిరాసిరా, 28 – మహేశ్వరపింద్‌లలో ఈ నెల 23న రీ-పోలింగ్ షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ విషయమై రాజకీయ అభ్యర్థులు, ఏజెంట్లందరికీ లిఖితపూర్వకంగా తెలియజేయాలని, ఓటర్లకు అవగాహన కల్పించేందుకు తగిన ప్రచారం చేయాలని ఎన్నికల ప్రధాన అధికారి జిల్లా ఎన్నికల అధికారికి సూచించారు.

శ్రామిక్ కాంగ్రెస్‌లో పలువురి చేరిక



శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహుతో కార్యకర్తలు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియ న్ నుంచి పలువురు కార్యకర్తలు శ్రామిక్ కాంగ్రెస్‌లో చేరారు. ఖుర్దారోడ్ రైల్వే మండలం తాల్చేరు శాఖ ముందంజ కార్యకర్తల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యూనియన్ కార్యకర్తలు తూర్పు కోస్తా రైల్వే శ్రామి క్ కాంగ్రెస్‌లో చేరడంపై ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు అభినందించారు. వీరందరికీ శ్రామిక్ కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. కొత్తగా శ్రామిక్ కాంగ్రెస్‌లో చేరిన వారిలో శ్రామిక్ యూనియన్ తాల్చేరు శాఖ మాజీ కార్యదర్శి అమరనాథ్ ప్రసాద్, యువజన శాఖ మాజీ సహ సమన్వయకర్త విపిన్ మిశ్రా ప్రముఖులుగా పేర్కొన్నారు. వీరి నేతృత్వంలో పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఖుర్దారోడ్ మండలం ఓపెన్ లైన్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టర్

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని విజయవాడ పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ వి.రాముడు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం దర్శించుకున్నారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేయించుకుని లక్ష్మీదేవి ఆలయాన్ని దర్శించారు. ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహాత్యాన్ని వివరించగా, ఈవో జి.గురునాధం స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.

సారా స్థావరాలపై దాడులు



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని సీడిపాలెంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు బుధవారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. 1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 45 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్, టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్‌నాయుడు, ఎస్ఈబీ ఎస్సై గణేష్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో నాలుగు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్‌టెస్ట్- 2024 (ఏపీ ఈఏపీ సెట్) పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. ఈ నెల 16 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 16, 17 తేదీల్లో బైపీసీ స్ట్రీం, 18 నుంచి ఎంపీసీ స్ట్రీం పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 12286 మందికి గాను 11654 మంది హాజరయ్యారు. 702 మంది గైర్హాజరయ్యారు. నాలుగు కేంద్రాల్లో బుధవారం 2070 మందికి 1954 మంది హాజరయ్యారు. బుధవారం నరసన్నపేట కోర్ టెక్నాలజీస్ సెంటర్‌లో మొదటి షిఫ్టులో 327 మందికి 310 మంది, రెండో షిఫ్టులో 328 మందికి 307 మంది, ఐతం టెక్కలిలో మొదటి షిఫ్టులో 300 మందికి 283 మంది, రెండో షిఫ్టులో 300 మందికి 285 మంది, చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 229 మందికి 216 మంది, రెండో షిఫ్టులో 228 మందికి 213 మంది, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 179 మందికి 171 మంది, రెండో షిఫ్టులో 179 మందికి 169 మంది హాజరయ్యారు. సెట్ అబ్జర్వర్లు పర్యవేక్షిస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- ఒకరి మృతి..మరొకరికి గాయాలు



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న హైవే సిబ్బంది

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీప జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస నుంచి శ్రీకాకుళం వైపు గ్రానైట్ లోడ్ లారీతో వస్తున్న ఎం.నాగరాజు, ఎల్.లకిత్‌కుమార్‌లు టెక్కలి ఆదిఆంధ్ర వీధి సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు పక్కన ఆపి లారీ పైభాగంలో పడుకున్నారు. అదే సమయంలో పలాస నుంచి ఇనుప రాడ్ల లోడుతో విశాఖ వైపు వెళ్తున్న మరో లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీపై ఉన్న ఇద్దరు యువకులు కిందకు తుళ్లి పడ్డారు. వీరిని ఢీకొట్టిన లారీ డ్రైవర్ సుకంత తల్లై(34) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, టెక్కలి సీఐ పైడయ్య, సిబ్బంది ఘటనా స్థలనికి చేరుకుని సుమారు 2 గంటలు శ్రమించి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుకంత మృతిచెందాడు. మరో లారీలో ఉన్న నాగరాజుకు చెయ్యి విరిగింది. వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడు ఒడిశా రాష్ట్రం కుర్దాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

వేడుకగా నృసింహాస్వామి జయంతి వేడుకలు

నృసింహాస్వామి జయంతి వేడుకలు పట్టణంలోని పలు మందిరాలలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కరణం వీధిని స్వామివారి మందిరంలో భక్తులు పానకాలు, పండ్లు కానుకగా సమర్పించారు. అలాగే జగన్నాథస్వామి మందిరంలో జగన్నాథుడు నృసింహాస్వామి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు నృసింహాస్వామి హిరణ్యకశిపున్ని అంతంచేస్తున్న దృశ్యాన్ని తమ ఫోన్లలో బంధించారు. మహిళలు స్వామివారి జయంతి సందర్భంగా ఉపవాసాలు పాటించారు.

-పర్లాకిమిడి



నృసింహాస్వామి అవతారంలో జగన్నాథుడు



కరణం వీధిలో పూజలందుకున్న నృసింహాస్వామి



పర్లాకిమిడిలోని నృసింహాస్వామి మందిరానికి వెళ్తున్న భక్తులు

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీఓ మాధవానంద నాయక్

పర్లాకిమిడి : ఈ నెల 19న గురండి పోలీసు ఠాణా పరిధిలో సర్దాపురం గ్రామ వంతెన వద్ద జరిగిన ప్రశాంత్ జెన్నా హత్య కేసును పోలీసులు రెండురోజుల్లో ఛేదించారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. బుధవారం స్థానిక సబ్-డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద్ నాయక్, గురండి ఐఐసీ రవీంద్ర కుమార్ పాత్రో మీడియా ముందు నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. గుసాని సమితి అగరఖండి పంచాయతీ భిన్నల గ్రామానికి చెందిన ప్రశాంత్ జెన్నా(24) సర్దాపురం గ్రామానికి చెందిన సింహాచల ప్రధాన్, సురేంద్ర ప్రధాన్‌లు స్నేహితులు. అయితే హైదరాబాద్‌లో పనిచేసి తిరిగొచ్చిన ప్రశాంత్ తరచూ తన స్నేహితుడు సింహాచల ప్రధాన్ ఇంటికి వెళ్లడంతో ఆయన భార్య ప్రభాతి ప్రధాన్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు గ్రామంలో పుకార్లు రేగాయి. దీంతో ప్రభాతి ప్రధాన్ ఈ ఏడాది ఫిబ్రవరి 27 విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. దీనికి ప్రశాంతే కారణమని సింహచల్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 18న పని ఉందని ప్రశాంత్ జెన్నాను సింహాచల్ సర్దాపురం రప్పించాడు. వంతెన వద్దకు వచ్చేసరికి సింహాచల ప్రధాన్, అనుచరుడు కలియా, ఇతర నిందితులు మారణాయుధాలతో దడి చేసి పరారయ్యారు. తీవ్ర గాయాల పాలైన ప్రశాంత్ జెన్నా బంధువులు పర్లాకిమిడి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలో రాగోలు జెమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విచారణ జరిపిన పోలీసులు ప్రధాన నిందితుడు సింహాచల ప్రధాన్ (సర్దాపురం), సంతోష్ స్వయిని (భిన్నల)లను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మరో ముగ్గురు నిందితులు సురేష్ బారిక్, కలియా అలియాస్ లోబా జెన్నాలు పరారీలో ఉన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ



చీరలు అందజేస్తున్న జీఎం పితంబర్ నాయక్

రాయగడ: పట్టణంలోని శక్తి సీనియర్ సిటిజన్ వృద్ధాశ్రమంలో ఉన్న మహిళలకు స్థానిక ఉత్కళ మీడియా పాత్రికేయుల సంఘం ప్రతినిధులు బుధవారం చీరలను పంపిణీ చేసింది. ఆశ్రమంలో ఉన్న సుమారు 30 మందికి చీరలతో పాటు పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి టికిరిలోని ఉత్కళ అల్యూమిన కర్మాగారం జనరల్ మేనేజరు (పీఆర్ విభాగం) పితంబర్ నాయక్, స్వయం సంపూర్ణ నంద (పీఆర్వో) , సీనియర్ న్యాయవాది ప్రదీప్‌కుమర్ దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సంఘం అధ్యక్షులు దయానిధి ఖడంగా మాట్లాడుతూ.. తమ సంఘం ఆవిర్భవించనప్పటి నుంచి ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సరోజ్ కుమార్ సాహు, మనోజ్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

భూమి కాదు.. బంగారు ఇటుక!



పోలీసులు స్వాధీనం చేసుకున్న నిందితుల కారు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామ సమీపంలో ఈ నెల 18న పోలీసులమని చెప్పి దోచుకెళ్లిన దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నౌతళ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజ్, ఫోన్ నంబర్ల ఆధారంగా పది మంది నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. రాష్ట్ర, అంతర్రాష్ట్ర ముఠాలకు ఈ ఘటనలో ప్రమేయమున్నట్లు తెలుస్తోంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో ధర్మలక్ష్మీపురం, బొంతు గ్రామాలలో భూములు కొనుగోలు కోసం తెచ్చిన డబ్బును పోలీసులమని చెప్పి తీసుకెళ్లినట్లు పెర్కొన్నారు. వాస్తవానికి, నిందితులను విచారించిన తరువాత 5 కేజీల బంగారం ఇటుకను ఒడిశాకు చెందిన వ్యక్తి అమ్ముతామని చెప్పగా అనకాపల్లి జిల్లా మామిడిపల్లి గ్రామానికి చెందిన డి.మణికంఠ రూ.10 లక్షలతో ధర్మలక్ష్మీపురం గ్రామానికి చేరుకున్నాడు. ముఠా సభ్యులు పక్కా స్కెచ్‌తో రెండు కార్లలో ధర్మలక్ష్మీపురం గ్రామానికి చేరుకుని బంగారం ఇటుకను ఇచ్చి డబ్బులు తీసుకుంటున్న సమయంలో నౌతళ వైపు నుంచి వాహనంలో ముగ్గురు వ్యక్తులు పోలీసు దుస్తులు ధరించి వచ్చి ఎన్నికల సమయంలో నగదు తరలించరాదని, ఈ నగదును డీఎస్పీ కార్యాలయంలో అప్పగిస్తామని చెప్పి వెళ్లిపోయారు. బాధితులు మోసాన్ని గుర్తించి తెరుకునే లోపు ముఠా సభ్యులు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్లో కేసు నమోదు కాగా ఎస్ఐ అప్పారావు దీనిని సవాల్‌గా తీసుకుని నిందితులను పట్టుకునే పనిలో పడ్డారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు, మన రాష్ట్రంలోని విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పలువురికి ఈ ముఠాతో సంబంధం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు 10 మందిని విచారిస్తుండగా మరో ఇద్దరు ఉన్నట్లు సమాచారం.



వైభవంగా ఊయల ఉత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో జరుగుతున్న వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలలో భాగంగా బుధ వారం సాయంత్రం స్వామివారికి ఊయల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు నేతృత్వంలో భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన ఊయలను కల్యాణ మండపంపై కొలువుదీర్చి కల్యాణం జరిపించారు. స్వామివారిని కవచ ధారణలో అలంకరించి విశేష ఆరాధనలు, సహస్రనామార్చనలు చేయగా..అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని డొంకూరు మత్స్యకార గ్రామంలో వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డొంకూరు గ్రామానికి చెందిన వాసుపల్లి రామారావు, ఉష(30) దంపతుల మధ్య రెండు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉష తన అత్త వారి ఇంట్లోనే దూలానికి వేలాడుతూ విగత జీవిగా కనిపించింది. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజికి ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఎస్.లక్ష్మణరావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఉషకు భర్తతో పాటు పదేళ్ల కుమార్తె నందన, ఐదేళ్ల కుమారుడు రిత్విక్ ఉన్నారు. ఉష మృతిపై అనుమానాలు ఉన్నాయని బంధువులు ఆరోపిస్తున్నారు.

'పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని రీసోర్సు పర్సన్ ముద్దాడ ఇందుమతి అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ అంశాలపై మాట్లాడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ వైభవం



నరసన్నపేటలోని వేంకటేశ్వరాలయం వద్ద నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమంత వాహన సేవ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన అష్ట లక్ష్మీదేవిల వేషధారణ ఆకట్టుకుంది. - నరసన్నపేట

భర్త హత్య కేసులో భార్య అరెస్టు



నిందితురాలు తిరుమలతో పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని గూనపాలెంలో ఈ నెల 17న పారిశుద్ధ్య కార్మికుడు సీరా సురేష్ (32) హత్యకు గురైన సంగతి విదితమే. ఈ కేసును పోలీసులు ఛేదించారు. భార్య తిరుమలే తన ప్రియుడితో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు సురేష్ భార్య తిరుమలను ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ లెంక సన్యాసినాయుడు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తిరుమల ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేసేది. ఒడిశా రాష్ట్రం కటక్‌కు చెందిన రియాజ్‌ఖాన్ కూడా అదే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేసేవాడు. ఈ క్రమంలో ఇద్దరూ ప్రేమ వ్యవహారం నడపడం, అది సురేష్‌కు నచ్చక భార్య తిరుమలతో తరచూ గొడవపడటంతో చివరకు హత్యకు దారితీసిందని పోలీసులు తెలిపారు. రియాజ్‌ఖాన్‌తో పాటు అతని మిత్రుడు నఫరుద్దీన్‌ఖాన్(ఒడిశా) హత్య చేయడానికి సహకరించాడు. నఫరుద్దీన్‌ఖాన్ ఆమదాలవలసలోని ఓ దాబాలో పనిచేస్తుండేవాడు. ప్రస్తుతం పోలీసుల అదుపులో నఫరుద్దీన్‌ఖాన్ ఉండగా, రియాజ్‌ఖాన్ పరారీలో ఉన్నాడు. ఈ కేసుకు విచారణాధికారిగా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ విజయ్‌కుమార్ వ్యవహరించగా, సీఐ లెంక సన్యాసినాయుడు అతని బృందంలోని ఎస్ఐ గణేష్, పీసీలు ఈ కేసును చాకచక్యంగా ఛేదించారు. డీఎస్పీ సీఐ, ఎస్ఐలను ఎస్పీ రాధిక అభినందించారు.

3 రోజుల పాపకు అరుదైన వెన్నెముక శస్త్రచికిత్స



శస్త్రచికిత్స అనంతరం పాపను ఎత్తుకున్న తల్లిదండ్రులు, వైద్యుడు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని గ్లోబల్ న్యూరో కేర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో డాక్టర్ దేవరెడ్డి గౌతమ్(న్యూరోసర్జన్) బుధవారం మూడు రోజుల పాపకు అరుదైన వెన్నెముక శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. గార మండలం కొర్ని గ్రామానికి చెందిన ప్రగడ చిన్నబాబు, శ్రీలత దంపతులకు మూడు రోజుల క్రితం పాప జన్మించింది. చిన్నారికి వెన్నెముక నరాలు బయటకు వచ్చాయి. దీనిని వైద్య పరిభాషలో మెనిం గోమైలోసీల్‌గా పేర్కొంటారు. ఈ నరాలను సరి చేసేందుకు అనస్థీషియాలజిస్ట్ డా.గొనప భవానీ నేతృత్వంలో డా.దేవరెడ్డి గౌతమ్ ఆధ్వర్యంలో నాలుగు గంటలపాటు శ్రమించి శస్త్రచికిత్సను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ 2.5కేజీల బరువు గల పాపకు ఇటువంటి ఆపరేషన్ చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని అని, పూర్తిగా మైక్రోస్కోపిక్ సర్జరీ చేయడంతో చక్కని ఫలితం లభించిందని తెలిపారు. శస్త్ర చికిత్సకు సహకరించిన డాక్టర్ సీపాన రాజేష్, డాక్టర్ రామకోటేశ్వర రావు(నియోటేలాలజిస్ట్)లకు కృతజ్ఞతలు తెలిపారు.

శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ..

- బస్సు కింద పడి మహిళ మృతి
- ఆందోళనకు దిగిన గిరిజనులు



ఘటనా స్థలంలో కోట హేమలత మృతదేహం

పాతపట్నం: మండలంలోని ద్వారకాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెళియాపుట్టి మండలం తూముకొండ రామచంద్రపురం గ్రామానికి చెందిన కోట హేమలత(45) తన కన్నవారి గ్రామమైన పాతపట్నం మండలం శిష్టుజగన్నాధపురంలో బారశాల శుభకార్యానికి కొడుకు మనోజ్‌తో కలిసి బుధవారం ఉదయం బయలుదేరింది. తిరుగు ప్రయాణంలో బస్సు కోసం తెంబూరు రోడ్డుకు శిష్టుజగన్నాధపురం గ్రామానికి చెందిన గుజ్జివాడ గురుమూర్తి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తెంబూరు రోడ్డుకు వచ్చేసరికి ఆర్టీసీ బస్సు వెళ్లిపోతుండడంతో ఓవర్‌టేక్ చేయడంతో ద్వారకాపురం వద్ద అదుపుతప్పడంతో ముగ్గురూ కింద పడిపోయారు. హేమలత బస్సు వెనుక టైరు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈమె భర్త కాంతారావు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిందిరు. కుమారుడు మనోజ్, కుమార్తె కుసుమ, మృణాళి ఉన్నారు. బస్సు డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే పాతపట్నం పోలీసుస్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయం పోలీసులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న సీఐ నల్లి సాయి, పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మాహమ్మద్ యాసీన్, రాజేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే గిరిజనులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బస్సు ఆపకుండా డ్రైవర్ వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకు మృతదేహాన్ని తీసుకువెళ్లద్దంటూ గిరిజన నాయకులు చౌదరి లక్ష్మణరావుతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. దీంతో తెంబూరు, పాతపట్నం రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది. టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, సీఐ సాయి బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.

భూమికి సారం..
వారికి జీవనాధారం!

- మందకాపునకు వేసవి అనుకూలం
- సేంద్రియ ఎరువుగా గొర్రెలు, మేకల వ్యర్థాలు
- భూసారం పెంచేదిశగా అడుగులు
- మందలు కాపుకాసే కుటుంబాలు జిల్లాలో 20 వేలు పైనే



రైతు పొలంలో కాపు వేసిన మేకలు, గొర్రెల మంద

ఎల్.ఎన్.పేట:

మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందుల వినియోగంతో భూసారం తగ్గిపోతోంది. ఇలాంటి చర్యలు భవిష్యత్‌తరాలకు ప్రతికూలంగా మారుతాయని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పలు సందర్భాల్లో రైతులకు అవగాహన కలిగిస్తూ వస్తున్నారు. దీంతో రైతుల ఆలోచనా విధానంలో మార్పు వస్తోంది. దీంతో పాత సంప్రదాయ పద్ధతుల్లోనే భూసారం పెచేందుకు రైతు లు ఆసక్తి కనబర్చుతున్నారు. ఇందులో ప్రధానమైనవి గొర్రెలు, మేకల (జీవాల) మందలను కాపు కాయటం, చెరువు పూడిక మట్టిని పొలాల్లో వేయ టం, కుల్లిన గత్తం వేసుకోవటం, పచ్చిరొట్టసాగు వంటి పద్ధతులు పాటించడం వంటివి చేస్తున్నారు.

జీవాలతో వలస..

పొలంలో జీవాల మందల కాపు కాయటంతో భూమికి సారంతో పాటు పెంపకందారులకు ఆదాయమార్గంగా ఉంటుంది. కోటబొమ్మాళి, రణస్థలం, గార, ఎల్.ఎన్.పేట, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, పలాస, వజ్రపుకొత్తూరు, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం, ఆమదావలస, శ్రీకాకుళం రూరల్, నరసన్నపేట తదితర మండలంలో జీవాల మంద కాపు కాసేవారు ఎక్కువగా ఉన్నారు. వీరు జిల్లా నలుమూలలకు జీవాల మందలను తీసుకుని వలసలు వెళ్తుంటారు.

తక్కువ ఖర్చుతో..

పగలంతా మేతకు వెళ్లి గొర్రెలు, మేకల మందను రాత్రికి రైతు పొలానికి తీసుకువస్తారు. రాత్రంతా పొలంలో ఉంచుతారు. ఒక రాత్రి పొలంలో ఉంచడంతో అవి వేసే పేడ(గెత్తం) వల్ల భూ సారం పెరుగుతుంది. ఒక రాత్రి రైతు పొలంలో మంద ఉంచేందుకు పది కుంచాల బియ్యం(30కిలోలు), రూ.300 నగదు, కూరగాయలు, చింతపండు, పప్పులు జీవాలు పెంచే వారికి రైతులు ఇస్తారు. ఎకరా పొలంలో నాలుగైదు రాత్రులు మంద కాపుకాయటం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. పంట సమయంలో ఎరువులు, పురుగుల మందుల ఖర్చు సగానికి తగ్గిపోతుంది. పురుగుల మందు, ఎరువుల అవశేషాల్లేని పంట దిగుబడులను సాధించవచ్చు.

భూసారం పెరుగుతుంది



పొలంలో గొర్రెలు, మేకల మందలను కాపుకాయటం వల్ల భూసారం పెరుగుతుంది. ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గుతుంది, పంట దిగుబడుల్లో ఎరువులు, పురుగు మందుల ప్రభావం లేకుండా ఉంటుంది. ఎరువుల వాడకంతో మిత్ర పురుగులు నశిస్తాయి. భూమి పొరల్లో ఉండే మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుంది. ఏటా మందల కాపుకాయటం వల్ల భూమి సారవంతంగా మారుతుంది.

– పైడి లతశ్రీ, ఎఓ, ఎల్.ఎన్.పేట

పూర్వీకుల నుంచీ..



మేకలు, గొర్రెలు కలిసి మంద కాయడం పూర్వీకుల నుంచి వస్తోంది. మా నాన్న నుంచి నేను కూడా మంద పెంచటం నేర్చుకున్నాను. ప్రతి రోజు మరో ఇద్దరు కలిసి జీవాలను మేతకు తీసుకుని వెళతాను. వేసవిలో రైతుల పొలాల్లో కాపుకాయటం వల్ల బియ్యం, కొద్ది మొత్తంలో డబ్బులు, కూరగాయలు ఇస్తారు. పొలాల్లో మంద కాపు కాయటం వలన భూమికి మేలు జరుగుతుంది.

– బొమ్మాళి శిమ్మన్న, గొర్రెల మంద యజమాని, కృష్ణాపురం, ఎల్.ఎన్.పేట

వేసవిలో అనుకూలం..

గొర్రెలు, మేకల (జీవాల) మందలను కాపుకాసేందుకు వేసవి అనుకూలం. ఖరీఫ్ తరువాత రబీలో ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు వేసుకుంటారు. పంట కోత తరువాత మందలు కాపుకాస్తారు. వేసవి వర్షాలు పడినప్పుడు పొలం దుక్కి చేస్తారు. ఆ సమయంలో గొర్రెల, మేకల వ్యర్థాలు భూమిలో కలిసి భూసారాన్ని పెంచుతాయి. ఈ వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

జిల్లాలో మండలాలు	గొర్రెలు, మేకల పెంపకందారులు	గొర్రెలు సంఖ్య	మేకల సంఖ్య
30	20వేల కుటుంబాలు	6,53,641	2,97,268

క్లుప్తంగా

కొరటాంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న రైతులు

తెర్లాం: మండలంలోని కొరటాం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములతో పాటు 20 బస్తాల ధాన్యం కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి వీఆర్‌ఓ రాము తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన చీకటి సూర్యనారాయణకు చెందిన రెండు గడ్డివాములు, అందులో నిల్వ ఉంచిన 20 బస్తాల ధాన్యం పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రాత్రి సమయంలో అగ్ని ప్రమాదం జరగడంతో మంటలను గ్రామస్తులు అదుపు చేయలేకపోయారు. రాజాం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ బుధవారం ఉదయం గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, నష్టాన్ని అంచనా వేశారు.

కాపర్ కేబుల్ చోరీ..



కాపర్ కేబుల్ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న రైతులు

శృంగవరపుకోట : మండలంలో మళ్లీ కాపర్ దొంగలు చేతివాటం చూపుతున్నారు. ప్రధానంగా పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున మండలంలో సంతగవిరమ్మపేట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్ కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. విషయం గమనించిన రైతులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కాపర్ కేబుల్ చోరీ వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు పాడై పొలాలకు నీరు అందని దుస్థితి నెలకొంటుందన్నారు. సుమారు రెండు నెలల కిందట జామి మండలంలో ఇదే తరహాలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లలో కేబుల్ చోరీ చేశారని.. పోలీసులు దొంగలను పట్టుకుని శిక్షించాలని కోరారు.

ఆటో బోల్తా..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలియజేసిన వివరాల మేరకు.. చీపురుపల్లి నుంచి రాజాం వైపు వస్తున్న ఆటో బొద్దాం గ్రామ సమీపంలో మేక అడ్డుగా రావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మండల పరిధి మారెడుబాక, పెనుబాక, కంచరాం గ్రామాలకు చెందిన మహాలక్ష్మి, రమణ, సునీత, గౌరమ్మ, భద్రరావు, వెంకటేష్ గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు 108 సహాయంతో గాయపడిన వారిని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసుల వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

- మెరిట్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు



విద్యార్థులకు సీటు కేటాయిస్తున్న ఏటీడబ్ల్యూఓ, ప్రిన్సిపాళ్లు

సీతంపేట: ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న బాలుర గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న విద్యార్థులకు పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించారు. సీతంపేట బాలుర కళాశాలలో 170, బాలికల కళాశాలలో 140 సీట్లు ఖాళీ ఉండగా అన్నీ సీట్లూ భర్తీ అయ్యాయి. మొత్తం 310 సీట్లకు గాను 984 మంది దరఖాస్తు చేసుకుని కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాళ్లు పైడి సూర్యకుమారి, పీపీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

‘ఊయల్లో’ బతకనిద్దాం..

- శిశువుల భవిష్యత్ నాశనం చేయొద్దు
- అనాథ శిశువుల కోసం ‘ఊయల’
- ఇప్పటి వరకు 51 మంది శిశువులను అక్కున చేర్చుకున్న శిశుగృహ సిబ్బంది
- పిల్లలు అక్కర్లేదనుకునే వారు శిశువలును ఊయల్లో వేయాలి : అధికారులు



దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఊయల

విజయనగరం ఫోర్ట్: విజయనగరంలోని గంటస్తంభం ప్రాంతంలో కొద్ది రోజుల కిందట శిశువు మృతదేహాన్ని పడేశారు. మెంటాడలో కొద్ది రోజుల కిందట తుప్పల్లో ఓ శిశువు మృతదేహాన్ని పడేశారు. అలాగే కొద్ది నెలల కిందట పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామ సమీపంలోని చెరువు గట్టు వద్ద ఒక రోజు వయసు గల మగ శిశువును వదిలి వెళ్లారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు ఆ శిశువును శిశుగృహలో చేర్చారు. వీరే కాదు, అనేక మంది శిశువులు ఏటా చెత్తకుప్పలు, రోడ్డు పక్కన, మురుగు కాలువల్లో విసిరేయబడుతున్నారు. బాహ్య ప్రపంచాన్ని చూద్దామని గర్భంలో ఉన్నప్పుడు శిశువులు ఎన్నో కలలు కంటారు.. తల్లి గర్భం నుంచి బయటకు రాగానే అమ్మ ప్రేమను పొందాలని ఆశ పడే శిశువులను కసాయి తల్లిదండ్రులు వదలించుకుంటున్నారు. ఇటువంటి దుస్థితి లేకుండా ఏ ఒక్క శిశువు కూడా అనాథగా మారకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఊయల అనే కార్యక్రమాన్ని చేపట్టింది.

పలు ప్రాంతాల్లో ఊయలలు ఏర్పాటు..

శిశువులను కాపాడాలనే ఉద్దేశంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధికారులు ఊయలలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఘోషా ఆస్పత్రి, స్వధార్ హోమ్, దిశ వన్‌స్టాప్ సెంటర్, బొబ్బిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఊయలలు ఉంచారు. పిల్లలను పోషించలేని వారు.. అక్కర్లేదనుకునే వారు ఆ శిశువులను ఊయలలో వేస్తే అక్కడ సిబ్బంది ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందిస్తారు. సమాచారం అందుకున్న వెంటనే వారు వచ్చి శిశువులకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తారు. అనంతరం జిల్లా కేంద్రంలోని శిశుగృహకు తరలించి సంరక్షణ కల్పిస్తారు. పిల్లల దత్తత కోసం శిశుగృహలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పిల్లలు లేని వారు, సంతానం పుట్టదని వైద్యులు ధృవీకరించిన తర్వాత అనాథ పిల్లలను దత్తత తీసుకోవాలని భావిస్తే ప్రభుత్వ పరంగా అధికారికంగా దత్తత ఇస్తారు.

51 మందికి రక్షణ ..

రోడ్డు పక్కల, చెత్తకుండీల వద్ద వదిలి వెళ్లిన శిశువులను ఐసీడీఎస్ అధికారులు సంరక్షించి శిశు గృహలో చేర్పించారు. అక్కడి సిబ్బంది వారికి రక్షణ, సంరక్షణ కల్పిస్తారు. ఇప్పటి వరకు 51 మంది శిశువులను ఐసీడీఎస్ సిబ్బంది అక్కున చేర్చుకున్నారు.



విజయనగరంలోని గంటస్తంభం ప్రాంతంలో చెత్త బుట్టలో పడేసిన శిశువు మృతదేహం (ఫైల్)



స్వధార్ హోమ్‌లో ఏర్పాటు చేసిన ఊయల

పిల్లల భవిష్యత్ నాశనం చేయొద్దు..

పిల్లల భవిష్యత్ నాశనం చేయొద్దు.. పిల్లలు పెంచలేని తల్లిదండ్రులు, ఇతర కారణాలు వల్ల గర్భం దాల్చి పిల్లలకు జన్మనిచ్చిన వారు పిల్లలు అక్కర్లేదనుకుంటే పిల్లలను ఊయలలో వేస్తే వారికి సంరక్షణ కల్పిస్తాం. పిల్లలు లేని తల్లిదండ్రులకు ప్రభుత్వపరంగా నిబంధనలను అనుసరించి దత్తత ఇస్తాం.

– త్రివేణి, శిశుగృహ మేనేజర్

చైన్‌స్నాచర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: పట్టణంలోని చైన్ స్నాచింగ్‌కి పాల్పడిన నిందితుడ్ని 24 గంటల్లోనే పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి చోరీ చేసిన చైన్, స్కూటీని రికవరీ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావుతెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం పట్టణంలోని కొత్త అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద గాజులరేగ వెళ్లేందుకు అరబిందోలో పనిచేస్తూ, గాజులరేగలో నివాసం ఉంటున్న కె. షణ్ముఖ వెంకటేష్ అనే వ్యక్తి ఈ నెల 21న ఆటోకోసం వేచినున్నాడు. ఆ సమయంలో ఒక వ్యక్తి స్కూటీపై వచ్చి తాను కూడా గాజులరేగ వైపు వెళ్తున్నానని, లిఫ్ట్ ఇస్తానని చెప్పడంతో షణ్ముఖ వెంకటేష్ అతని స్కూటీ ఎక్కారు. మార్గమధ్యలో అతన్ని బెదిరించి చైన్ లాక్కొని పరారయ్యాడు. బాధితుడు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. వన్‌టౌన్ క్రైమ్ ఎస్సై జె.తారకేశ్వరరావు, క్రైమ్ హెచ్‌సీ అచ్చిరాజు, పోలీస్ బృందం దర్యాప్తు ప్రారంభించి చైన్ స్నాచింగ్‌కి పాల్పడిన వ్యక్తిని లంకాపట్నానికి చెందిన ధన్నాన ఏసుగా గుర్తించి, బుధవారం స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీచేసిన బంగారు చైన్, స్కూటీని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.


గిరిజన యూనివర్సిటీలో ప్రవేశాలకు గడువు పెంపు

- ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, వీసీ

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు గడువు ఈ నెల 26వ తేదీకి పొడిగించినట్లు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందు ప్రకటించిన మేరకు గడువు బుధవారంతో ముగుస్తుందని.. విద్యార్థుల అభ్యర్థన మేరకు పొడించామని పేర్కొన్నారు. పీజీ ప్రొగ్రామ్‌లకు దరఖాస్తు చేయాలనుకునే వారు ‘సీటీయూఏపీ.ఏసీ.ఐఎన్’ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 26వ తేదీ రాత్రి 11.55 నిమిషాలలోపు రిజిస్టర్ చేసుకోవాలని.. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్ లేదా 63004 43499 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యూనివర్సిటీలో అందిస్తున్న కోర్సులివే...

యూనివర్సిటీలో అందిస్తున్న వివిధ కోర్సుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎంఏ ట్రైబల్ స్టడీస్, ఎంఏ సోషియాలజీ, ఎంఏ ఇంగ్లిష్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ), మాస్టర్ ఆఫ్ జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఎంబీఏ రెండేళ్ల పీజీ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులకు ఏదైనా మూడేళ్ల డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్ పాలసీని అనుసరించి ప్రవేశ పరీక్ష మెరిట్ ఆధారంగా గిరిజనులకు, గిరిజనేతరులకు కూడా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.



ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, వీసీ

పరువు పోతుందని ప్రాణాలు తీసుకున్నాడు..

- కర్లాంలో యువకుడి ఆత్మహత్య
- కేసు నమోదు చేసిన పోలీసులు

చీపురుపల్లి: ఇద్దరిదీ ఒకే ఊరు.. కులాలు వేరైనప్పటికీ మనసులు కలిశాయి.. ఏడాది కాలంగా ప్రేమించుకుంటూ, సాన్నిహిత్యంగా మెలిగారు.. పెళ్లి చేసుకోమని యువతి ఒత్తిడి చేయడం, పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో ఎక్కడ పరువు పోతుందోనని ఆందోళనతో యువకుడు రెండు రోజుల కిందట ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కర్లాం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ మేరకు మృతుడి సోదరుడు మరువాడ రాము పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె. కిరణ్ కుమార్ నాయుడు బుధవారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్లాం గ్రామానికి చెందిన మరువాడ లక్ష్మణరావు అదే గ్రామానికి చెందిన యువతితో ఏడాది కాలంగా ప్రేమలో ఉంటూ, సాన్నిహిత్యంగా మెలిగాడు. ఈ క్రమంలో యువతి తనను పెళ్లి చేసుకోమని లక్ష్మణరావుపై ఒత్తిడి తీసుకువచ్చింది. అయితే లక్ష్మణరావు నుంచి సరైన సమాధానం రాకపోవడంతో యువతి, కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అక్కడ కూడా యువతి తనకు లక్ష్మణరావుతో పెళ్లి కావాలని పట్టుబట్టింది. దీంతో గ్రామపెద్దలు ఇరువర్గాలతో మాట్లాడి వస్తామని పోలీస్‌స్టేషన్ నుంచి వెళ్లిపోయారు. అయితే కులాంతర వివాహానికి కుటుంబ సభ్యులు ఒప్పుకుంటారో, లేదో.. పోలీస్ కేసు నమోదైతే పరువుపోతుందనే ఆందోళనతో లక్ష్మణరావు రెండు రోజుల కిందట గ్రామ సమీపంలోని తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కేసు నమోదు చేశాం..

లక్ష్మణరావు ఆత్మహత్యకు సంబంధించి సోదరుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై కె. కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు. మృతదేహానికి చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు.

నూతిలో పడి వ్యక్తి మృతి



శివకుమార్ మృతదేహం

దత్తిరాజేరు: విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కుచ్చరపాటిశివ కుమార్ (60) ప్రమాదవశాత్తూ నూతిలో పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... దత్తిరాజేరు మండలం చినకాదలో గ్రామదేవత పండుగ జరుగుతున్న నేపథ్యంలో బంధువుల ఇంటికి శివకుమార్ వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలోని రాజులపేట వద్ద ఉన్న బావిలో దిగి ఈత కొడుతుండగా.. ఊబిలో కాళ్లు కూరుకుపోయి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు భార్గవ్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శిరీష తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




గొలగాని అప్పన్న మృతదేహం

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఇందుకు సంబంధించి వల్లంపూడి ఎస్సై రాజేష్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పిల్లా అగ్రహారానికి చెందిన గొలగాని అప్పన్న (55) కుమ్మపల్లి కోళ్లఫారంలో పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం జంక్షన్‌లో రోడ్డుపక్కన నడుస్తుండగా.. కొత్తవలస నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న టాటా మ్యాజిక్ ఢీ కొట్టింది. దీంతో అప్పన్న అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో సైబర్ మోసం..

- ఆలయ పూజారి అకౌంట్ నుంచి రూ. 1.21 లక్షలు మాయం

రాజాం సిటీ: సైబర్ వలకు చిక్కి ఓ ఆలయ పూజారి ఏకంగా తన అకౌంట్ నుంచి రూ. 1.21 లక్షలు పోగొట్టుకున్న విషయం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం పట్టణ పరిధి చీపురుపల్లి రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయ పూజారి పీసపాటి వెంకటసూర్యనారాయణ స్వామికి ఐసీఐసీఐ బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. అయితే ఈ నెల 20న ఉదయం 11.34 గంటలకు వాట్సాప్‌లో +91 93024 89544 నంబర్‌తో ఐసీఐసీఐ బ్యాంక్ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. సాయంత్రం 5.46 గంటలకు +91 82409 58147 నంబర్ నుంచి ఫోన్ చేసి ఐసీఐసీఐ బ్యాంక్ కస్టమర్ కేర్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి పాన్‌కార్డు కేవైసీ చేసుకోవాలన్నారు. వారు అడిగిన వివరాలు బ్యాంక్‌లో తెలియజేస్తానని బాధితుడు చెప్పినా... వారు ఒత్తిడి చేసే సరికి వివరాలు తెలియజేశాడు. ఇంతలో సాయంత్రం 6.47 గంటలకు అకౌంట్ నుంచి 1.21 లక్షల రూపాయలు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై టౌన్ సీఐ డి.మోహనరావు వద్ద ప్రస్తావించగా.. సంబంధిత వ్యక్తి అకౌంట్ బ్లాక్ చేయించామన్నారు. అలాగే సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



రూ. 1.21 లక్షలు కట్ అయినట్లు వచ్చిన మెసేజ్‌ను చూపుతున్న ఆలయ పూజారి పీవీ సూర్యనారాయణ



సైబర్ నేరగాళ్లు బ్యాంకు పేరుతో పంపిన మెసేజ్

ముగిసిన అంపకోత్సవం



గొల్లపల్లిలో సిరిమాను వద్ద గుమిగూడిన భక్తులు

బొబ్బిలి: గొల్లపల్లిలో దాడితల్లి అమ్మవారు, పాత బొబ్బిలిలో సరే పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసాయి. చివరి రోజైన అంపకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాతబొబ్బిలి సరే పోలమ్మ, దాడితల్లి అమ్మవార్లను ఊరేగింపుగా తిరిగి ఆలయాలకు తీసుకువెళ్లారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాయి.

కాలుష్య రహిత ఉత్సవాలు:

గొల్లపల్లి, పాతబొబ్బిలి అమ్మవార్ల ఉత్సవాలు ఈ ఏడాది కాలుష్య రహితంగా జరిగాయి. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈసీ ఆదేశాలతో ప్రభుత్వ యంత్రాంగం ఉత్సవాలకు హంగులు, ఆర్భాటాలను రద్దు చేయడంతో ఉత్సవాల్లో ఎలాంటి శబ్దకాలుష్యానికి తావులేకుండా నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావు పట్టణంలో డీజేలు, స్టేజి ప్రదర్శనలు, మందుగుండు సామగ్రి వినియోగం లేకుండా కమిటీ పెద్దలతో మాట్లాడారు. దీన్ని అమలు చేయడంలో సఫలీకృతులయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవడంతో పండగలు ప్రశాంతంగా ముగిశాయి.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 24 నుంచి జరగనున్న పది, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పది, ఇంటర్, ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు, డీఈఈ సెట్ నిర్వహణపై తన చాంబర్‌లో బుధవారం సమీక్షించారు. పరీక్షల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను ఆయా శాఖల అధికారుల ద్వారా తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని.. సమీపంలోని జిరాక్స్, నెట్ సెంటర్లను మూసి వేయాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని, వాటిని తరలించేటప్పుడు తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాలను ముందుగానే తనిఖీ చేసి, అన్ని వసతులూ కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఆయా ప్రభుత్వ శాఖలు కంట్రోలు రూమ్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, డీఈఓ ఎస్.ప్రేమకుమార్, ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ, డీవీఈఓ ఎస్.భీమశంకర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఈసీ సభ్యులు ఎం.సత్యనారాయణ, కె.అప్పారావు, ఎస్.రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ టి.సన్యాసిరావు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

24 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతుంది. మొత్తం 4,210 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 2,482 మంది బాలురు, 1,728 మంది బాలికలున్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 19 మంది చీఫ్ సూపరింటిండెంట్లను, 19 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 185 మంది ఇన్విజిలేటర్లును ఏర్పాటు చేస్తున్నారు.

24న డీఈఈ సెట్

ఈ నెల 24న డీఈఈ సెట్ నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్ష కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో స్థానిక జేఎన్‌టీయూ జంక్షన్ సమీపంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతుంది. మొత్తం 256 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు.

జూన్ 1 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయి. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరి గే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలకు 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 548 మంది రాయనున్నారు. ఇంటర్ పరీక్షలకు 3 పరీక్ష కేంద్రాల్లో 664 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటిండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 65 మంది ఇన్విజిలేటర్లను నియమించన్నారు. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12 వరకు జరుగుతాయి.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

ఈ నెల 24 నుంచి 31 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు 14,904 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7,927 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తం 42 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సర పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు.. రెండో సంవత్సర పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 వరకు జరుగుతుంది. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు మరో అదనపు చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, 500 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నవధాన్యాల సాగుతో పొలం సారవంతం



నవధాన్యాలను పొలంలో వేయిస్తున్న దశ్యం

రేగిడి: రైతులు ఖరీఫ్‌కు ముందు పంటపొలాల్లో నవధాన్యాలను వేయడం వల్ల భూమి సారవంతమవడమే కాకుండా జీవ వైవిధ్యం పెరుగుతుందని ప్రకతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో సర్పంచ్ కరణం గోవిందరావుకు చెందిన ఐదెకరాల పొలంలో బుధవారం 30 రకాల నవధాన్యాల విత్తనాలను వేయించారు. రైతులు ఖరీఫ్ దుక్కులు చేసే సమయంలో నవధాన్యాల విత్తనాలు వేసుకోవడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. తరువాత సాగుచేసే పంటలకు పోషకాలు సమృద్ధిగా అందుతాయని, ఫలితంగా అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులంతా నవధాన్యాలను సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు, ఐసీఆర్‌పీలు ఐ.తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

రేగిడి: పచ్చిరొట్ట ఎరువుల ద్వారా నేల సారవంతంగా ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో పీఎండీఎస్ క్రాప్ కటింగ్ కార్యక్రమంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువులతో కలిగే లాభాలను వివరించారు. 18 రకాల పప్పుగింజల విత్తనాలను దమ్ముకు ముందు పొలంలో వేయడం వల్ల నేలకు మంచి సత్తువ వస్తుందన్నారు. కిలో పచ్చిరొట్ట ఎరువు వందకిలోల పశువుల ఎరువుతో సమానమని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు, సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.